

అక్రిడిటేషన్ల గడువు మరో 2నెలలు పొడిగింపు

2


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 2 సంచిక - 253 బుధవారం 31 డిసెంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts






# ముక్కోటి శోభ

## తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి

### అర్ధరాత్రి నుంచే ప్రత్యేక దర్శనాలు

### భారీగా తరలివచ్చిన ప్రముఖులు

### సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రుల దర్శనం

**తిరుమలడిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):**
తిరుమలతెలుగు రాష్ట్రాల్లో ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, సినీ ప్రముఖులు ఉత్తర ద్వారం మిగతా 2లో...






# ప్రణాళికాబద్ధంగా పనిచేయండి



- -గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలి
- - అందుకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- - ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని వాడండి
- - పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యత
- - పనుల పురోగతిపై ప్రతినెలా స్వయంగా సమీక్షిస్తా
- -పురపాలకశాఖ సమీక్షా సమావేశంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

**హైదరాబాద్,డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. వచ్చే ఐదేండ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని తెలిపారు. కలిసికట్టుగా పని చేస్తేనే నగర భవిష్యత్తు మారుతుందని వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ఉన్నతాధికారులు, కొత్త కమిషనర్లతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిగతా 2లో...



# ఏపీ గ్రూప్-2 అభ్యర్థులకు భారీ ఊరట

### నియామకాలకు లైన్ క్లియర్

### గ్రూప్-2 రిజర్వేషన్లపై హైకోర్టు కీలక తీర్పు

### రోస్టర్ పాయింట్లపై దాఖలైన అన్ని పిటిషన్లను తోసిపుచ్చిన ధర్మాసనం

### లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు లభించిన భారీ ఊరట

**అమరావతిడిసెంబర్ 31, జర్నలిస్ట్ జర్నీ న్యూస్**
ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్-2 నియామకాల్లో రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటినీ ఏపీ హైకోర్టు కొట్టివేసింది. మంగళవారం వెలువడిన ఈ తీర్పుతో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ నిర్ణయం లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం కలిగించింది. 2023లోమిగతా 2లో...

# బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాని ఖలీదా కన్నుమూత

### అనారోగ్యంతో మృతి..పలువురి సంతాపం

### కడసారి చూపునకు తరలివచ్చిన ప్రజానీకం




**ఢాకా :డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):**
బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్‌పర్సన్, మాజీ ప్రధాని ఖలీదా జియా (80) మంగళవారం ఉదయం కన్నుమూశారు. గుండె, కాలేయం, కిడ్నీ, ఊపిరితిత్తులు, ఆర్థరైటిస్, కంటికి సంబంధించిన రుగ్మతలు వంటి ఆరోగ్య సమస్యలతో అనేక సంవత్సరాలుగా బాధపడుతున్న ఖలీదా ఢాకాలోని ఎవర్‌కేర్ ఆస్పత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో మిగతా 2లో...

# పుతిన్ నివాసంపై డ్రోన్ల దాడి

### తిప్పి కొట్టిన బలగాలు

### ఆందోళన కలిగించిందన్న మోదీ, ట్రంప్

**మాస్కో, వాషింగ్టన్ డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):**
రష్యా అధ్యక్షుడు వ్లాఆదివారం రాత్రి దాడి జరిగిందని విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ తెలిపారు. మాస్కోకు సమీపంలోని నొవొగార్డ్ రీజియన్‌లో ఆయన అధికార నివాసంపై దీర్ఘశ్రేణి డ్రోన్లతో దాడికి యత్నించారని, మొత్తంగా 91 కమికజె డ్రోన్లు ఉపయోగించారని, వాటన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని తెలిపారు. కాగా ఈ దాడిని ఉగ్ర దాడిగా పేర్కొంటూ రష్యా ఉన్నతాధికారులు ఖండించారు.మిగతా 2లో...





# తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు

### క్రైమ్ రేటును బాగా తగ్గించగలిగాం

### పంచాయితీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం

### మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం

### మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం

### 2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డిజిపి శివధర్ రెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త్):** తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇటీవలి మూడు విడతల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కూడా శాంతి భద్రతలు కాపాడి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూశామని డీజీపీ అన్నారు. మంగళవారం నాడు 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారుమిగతా 2లో...

# తెలంగాణ అసెంబ్లీ బిఆర్ఎస్ లీడర్ల నియామకం

### డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితా, తలసాని

### బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

### ప్రకటన విడుదల చేసిన అగ్రనేత కెసిఆర్



**హైదరాబాద్,డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారిని బీఆర్ఎస్ ఎ÷-లోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారిని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే మిగతా 2లో...


# ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం..

### శత్రువుల డ్రోన్లు, మిస్సైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

### ఢిల్లీ గగనతల భద్రతపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు

### రూ. 5,181 కోట్ల అంచనాతో సుదర్శన చక్రం

### గగనతల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక దృష్టి



**ఢిలీ డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):**
దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ-89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది.మిగతా 2లో...

# ముక్కోటి శోభ





(మొదటి పేజి తరువాయి)

గుండా ఆ గోవిందుడిని దర్శించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. అనేక మంది రాజకీయ, సినీ ప్రముఖులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారం గుండా శ్రీనివాసుడి దర్శనం చేసుకున్నారు.ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, బాలకృష్ణ సతీమణి వసుంధర, నటులు రాజేంద్ర ప్రసాద్, నారా రోహిత్, శివాజీ, హీరోయిన్ శ్రీలీల, నటి హేమ, నిర్మాతలు డి.వి.వి దానయ్య, బండ్ల గణెశ్, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, చాముండేశ్వరి నాథ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

### తెలంగాణలో వైకుంఠ ఏకాదశి సందడి
### యాదాద్రికి పోటెత్తిన భక్త జనం
### ఉత్తరద్వార దర్శనం చేసుకున్న ప్రముఖులు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయాలు కిక్కిరిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు భక్తులు చేరుకుంటున్నారు. తెలంగాణలో యాద్రాద్రి, భద్రాచలం, ధర్మపురి, చిలుకూరి బాలాజీ సహా పలు పుణ్యక్షేత్రాల వద్ద భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఇక, ఏపీలోని తిరుమల, సింహాద్రి అప్పన్న ఆలయం, ద్వారకా చినతిరుమల సహా వివిధ ఆలయాలకు భక్తులు తండోపతండాలుగా తరలివెళ్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు వివిధ ఆలయాలను దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. భద్రాచలం రామాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై శ్రీ రాముడు,గజ వాహనం పై సీతమ్మ,హనుమద వాహనంపై లక్ష్మణ స్వామి దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, స్థానిక
ప్రజా ప్రతినిధులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. యాదాద్రిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఇచ్చిన లక్ష్మీ నరసింహ స్వామి వారిని చూడటానికి భారీగా భక్త జనం తరలి వచ్చారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు, ఈవో వెంకట్రావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జామునే గోదావరిలో స్నానమాచరించిన భక్తులు ఆలయానికి తరలివచ్చారు. హైదరాబాద్‌లో టిటిడి ఆలయాల్లో రద్దీ కనిపించింది. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలిచ్చారు. హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్ వేంకటేశ్వరాలయంలో భారీగా ఏర్పాట్లు చేశారు. వనపర్తి జిల్లాలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తున్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చారు. ముఖ్యంగా వరంగల్ బట్టల బజార్, వందపీట్ల రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ధర్మసాగర్ మండలం చిల్పూర్ బుగులు వేంకటేశ్వరస్వామి, నర్సింహులపేట వేంకటేశ్వరస్వామి ఆలయాలు సహా పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు అధికారులు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# తెలంగాణ అసెంబ్లీ బిఆర్ఎస్ లీడర్ల నియామకం

(మొదటి పేజి తరువాయి)

ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

# ప్రణాళికాబద్ధంగా పనిచేయండి

(మొదటి పేజి తరువాయి)

అన్ని విభాగాలు గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ఏరియాను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని ఆయన ఆదేశించారు.

హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయి ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకునేందుకు ఇటీవల గ్లోబల్ సమ్మిట్ వేదికగా 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' డాక్యుమెంట్‌ను విడుదల చేసినట్టు గుర్తు చేశారు. అందులో భాగంగా ఓఆర్ఆర్ లోపల ఉన్న క్యూర్ ఏరియాను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా ఇప్పటికే పునర్ వ్యవస్థీకరించామని గుర్తు చేశారు. స్థానిక పరిపాలనను పట్టా లెక్కించాలనేదే తమ ఆలోచన అని ఆయన తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలనుకుంటున్నామని చెప్పారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన చెత్త నిర్వహణకు సంబంధించిన సమస్యను సమర్థవంతంగా అధిగమించాలని సూచించారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా సిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఆదేశించారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని సూచించారు. క్యూఆర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ బస్సులు, ఆటోలను తీసుకొస్తామని చెప్పారు. జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేననీ, జోన్ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలనీ, రోడ్లపై ఎక్కడా చెత్త, గుంతలు కనిపించకుండా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు.

నెలకోసారి స్వయంగా సమీక్ష

క్యూర్ పరిధిలోని హోటల్స్‌లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు అందుబాటులో ఉన్న స్థలాన్ని కేటాయించి భవనాలు నిర్మించాలని కోరారు. అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు కార్యాలయాలను తరలించాలని చెప్పారు. క్యూర్ పరిధిలోని 12 జోన్లలో చెరువులు, కుంటలు, నాలాలను పూర్తిగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఆక్రమణలను తొలగించి వర్షాకాలంలో వరదలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద చెరువులను గుర్తించి వాటిని పునరుద్ధరించి యాక్టివిటీ జోన్స్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. జనవరి నుంచి ప్రతి ఒక్కరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. నెలకోసారి స్వయంగా జోనల్ కమిషనర్లతో తాను సమీక్ష నిర్వహిస్తానని ఆయన తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎమ్‌డీ అశోక్ రెడ్డి, హెచ్ఎమ్‌డీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

టెక్నాలజీని వాడుకోవాలి

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలను అందించే దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువ పత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని తెలిపారు. తద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని తెలిపారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని అన్నారు. సుపరిపాలనతో పాటు స్మార్ట్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ ఏరియాలో విభాగాల అధికారులను స్పెషల్ సీఎస్ సమన్వయం చేసుకుంటారని తెలిపారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని జోనల్ కమిషనర్లకు సీఎం సూచించారు.

# తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు

(మొదటి పేజి తరువాయి)

. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్టంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడం లో పోలీసులు సమర్థంగా పనిచేశారని అన్నారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా , తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్తా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా శిఖా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలిపారు. ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు.

# ఏపీ గ్రూప్-2 అభ్యర్థులకు భారీ ఊరట

(మొదటి పేజి తరువాయి)

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) జారీ చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌పై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రధానంగా మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు (ఎక్స్-సర్వీస్‌మెన్), క్రీడాకారులకు కేటాయించిన ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు నిబంధనల ప్రకారం లేవని పిటిషనర్లు ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను సరిచేసి, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్తది జారీ చేయాలని కోరారు.

దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది. అన్ని పిటిషన్లను కొట్టివేయడంతో నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఇప్పటికే గ్రూప్-2 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో, ఈ తీర్పు అభ్యర్థుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. రోస్టర్ పాయింట్ల వివాదంతో నియామకాలు ఎక్కడ ఆగిపోతాయోనని ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు ఈ తీర్పు ఊరటనిచ్చింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో ఏపీపీఎస్సీ తదుపరి నియామక ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది.

# ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం..

(మొదటి పేజి తరువాయి)

ఈ గగనతల రక్షణ వ్యవస్థను 'సుదర్శన చక్ర %-% ఫర్ ఢిల్లీ' అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం.ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 'సుదర్శన చక్ర' వ్యవస్థ గురించి ప్రస్తావించారు. దేశంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలు, పౌర కేంద్రాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని అప్పుడే ప్రకటించారు.ఈ వ్యవస్థలో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించే అధునాతన రాడార్ వ్యవస్థలు, వాటిని మధ్యలోనే కూల్చివేసే ఇంటర్‌సెప్టర్లు, అలాగే సైబర్ యుద్ధాన్ని ఎదుర్కొనే సామర్థ్యం కూడా ఉండనుంది. డీఆర్‌డీవో, ప్రైవేట్ రక్షణ సంస్థలు, భారత సైన్యం కలిసి ఈ భారీ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఇప్పటికే ప్రాథమిక సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. మొత్తంగా చూస్తే, ఢిల్లీ గగనతల భద్రతను ఇనుమడింపజేసే దిశగా సుదర్శన చక్ర ప్రాజెక్ట్ దేశ రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# పుతిన్ నివాసంపై డ్రోన్ల దాడి

(మొదటి పేజి తరువాయి)

ఈ దాడిపై కచ్చితంగా ప్రతీకార చర్య తీసుకుంటామని ప్రతిన చేశారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు ప్రస్తుతం శాంతి ప్రణాళికపై చర్చలు జరుగుతున్న తరుణంలో ఈ ఘటన మాస్కో వైఖరిని ప్రభావితం చేసే అవకాశం వుందని, కచ్చితంగా దీనిపై సమీక్ష వుంటుందని లావ్‌రోవ్ చెప్పారు. చర్చల నుండి బయటకు రాబోమని, అయితే తమ వైఖరిని సమీక్షించుకుంటామని చెప్పారు. అయినా ఇలాంటి నిర్లక్ష్యపూరితమైన, బాధ్యతారాహిత్య చర్యలకు సమాధానం చెప్పకుండా ఎలా వదిలివేస్తామని ప్రశ్నించారు. ఇది 'ప్రభుత్వ ఉగ్రవాదం' కిందకు వస్తుందని చెప్పారు. అయితే ఈ దాడి జరిగిన సమయంలో పుతిన్ ఆ నివాసంలో వున్నారా లేదా అనేది స్పష్టం కాలేదు.ఈ దాడి గురించి పుతిన్ స్వయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సోమవారం ఫోన్ చేసి చెప్పారు. ఈ విషయం తెలియగానే ట్రంప్ దిగ్భ్రాంతికి గురయ్యారని క్రెమ్లిన్ విదేశాంగ విధాన సహాయకుడు యురి యుష్కొవ్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ డ్రోన్ దాడిని ట్రంప్ ఖండించారు. 'అత్యంత సున్నితమైన సమయంలో జరిగిన ఘటన' అంటూ ఈ దాడి తనకు తీవ్ర ఆగ్రహాన్ని కలగచేసిందన్నారు.వైట్‌హౌస్ వెలుపల ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి ట్రంప్ మాట్లాడారు. కాగా ఇదంతా అసత్యమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వ్యాఖ్యానించారు.

**తీవ్రంగా ఆందోళన కలిగించింది : మోడీ**

పుతిన్ నివాసంపై దాడి వార్త తమకు తీవ్రంగా ఆందోళన కలిగించిందని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలు శాంతిని నెలకొల్పే దిశగా సుస్థిర బాటను వేస్తున్నాయన్నారు. ఈ దశలో ఈ ప్రయత్నాలపైనే అందరూ దృష్టి పెట్టాల్సి వుందని అన్నారు. అంతేకానీ ఆ శాంతి ప్రక్రియకు విఘాతం కలిగించే దిశగా ఎలాంటి చర్యలు తీసుకోరాదన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

# బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాని ఖలీదా కన్నుమూత


(మొదటి పేజి తరువాయి)

చికిత్స పొందారు. ఆమెకు శాశ్వత పేస్‌మేకర్‌ను అమర్చారు. గుండెకు సంబంధించిన సమస్య కారణంగా ఖలీదాకు గతంలో స్టెంట్ వేశారు. ఖలీదా మరణవార్తను బీఎన్‌పీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలియజేసింది. ప్రార్థనల అనంతరం ఉదయం 6 గంటలకు ఆమె కన్నుమూశారని వెల్లడించింది.

ఆమె ఆత్మ శాంతి కోసం ప్రజలంతా ప్రార్థించాలని కోరింది. బ్రిటీష్ ఇండియాలోని అవిభక్త దినాజ్‌పూర్ జిల్లాలో భాగమైన జల్పాయిగురిలో ఖలీదా జియా జన్మించారు. ఆమెకు కుమారుడు తారిక్ రెహ్మాన్, కోడలు జుబైదా రెహ్మాన్, మనుమరాలు జైమా రెహ్మాన్ ఉన్నారు. ఆరోగ్యం సహకరించక పోయినప్పటికీ వచ్చే సంవత్సరం జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రచారం చేస్తానని ఆమె ఇటీవల హామీ ఇచ్చారు. లండన్‌లో ఆధునిక వైద్య చికిత్స పొందిన తర్వాత ఢాకా వచ్చిన ఖలీదా ఎవర్‌కేర్ ఆస్పత్రిలో తరచూ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 17 సంవత్సరాల పాటు స్వీయ ప్రవాస జీవితం గడిపిన అనంతరం ఆమె కుమారుడు తారిక్ రెహ్మాన్ ఇటీవలే స్వదేశానికి చేరుకున్నారు. అయితే బంగ్లాదేశ్ ప్రధానిగా పదవిని చేపట్టిన తొలి మహిళ ఖలీదాయే. 1960లో ఆమె జియావుర్ రెహ్మాన్‌ను వివాహం చేసుకున్నారు. ఆయన 1977లో దేశాధ్యక్షుడు అయ్యారు. 1981లో జరిగిన సైనిక కుట్రలో జియావుర్ హత్యకు గురైన తర్వాత క్రియాశీలక రాజకీయాలలోకి ఖలీదా ప్రవేశించారు. 1984లో బీఎన్‌పీ ఛైర్‌పర్సన్ అయ్యారు. 1991లో ప్రతిపక్షాల విజయానికి ఆమె నేతృత్వం వహించి బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానమంత్రి అయ్యారు. 1991 నుంచి 1996 వరకూ, 2001 నుంచి 2006 వరకూ ఆమె ప్రధాని పదవిని నిర్వహించారు. అయితే అవినీతి ఆరోపణల కారణంగా ఆమె సుదీర్ఘ కాలం జైలు జీవితం గడపాల్సి వచ్చింది. గత ఏడాదే ఆమె గృహ నిర్బంధం నుంచి విడుదలయ్యారు

# అక్రిడిటేషన్ల గడువు మరో 2నెలలు పొడిగింపు

### జివో 252తో జర్నలిస్టులకు అన్యాయం
### మంత్రి పొంగులేటిని కలిసిన యూనియన్ నేతలు



హైదరాబాద్ **డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):** అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే నోటిఫజకేషన్ త్వరాలో వెలువడనున్న తరుణంలో ఆలస్యం కాకుండా ప్రస్తుతం ఉన్న అక్రిడేషన్ల గడవును మరో రెండు నెలలు పెంచారు. ఈ మేరకు సమాచారశాఖ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగిస్తూ సమాచారశాఖ కమిషనర్ ప్రియాంక ప్రకటన విడుదల చేశారు.

# యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు.

**-జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్.**




**బయ్యారం/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండలంలో ఈ సంవత్సరం యాసంగి సీజన్లో సాగు చేసే రైతుల పంటలకు ఎరువులు సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం బయ్యారం మండల కేంద్రంలోని ఆగ్రో ఫెర్టిలైజరు సెంటర్, సొసైటీ,కొత్తపేటలోని రైతు వేదికలో ఎరువుల యూరియా నిల్వలను తనిఖీ చేసి పరిశీలించారు. యూరియా స్టాక్ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏటువంటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగా రైతులు ఏఏ పంటలు వేశారు,వాటికి కావాల్సిన ఎరువుల వివరాలు ముందుగానే గ్రహించి వారికి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి కాంటాలు నిర్వహించిన బస్తాలను నిలువ ఉంచకుండా వెంటనే మిల్లులకు తరలించాలని కొనుగోలు నిర్వహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు,మండల స్పెషల్ అధికారి శ్రీనివాస్ రావు,మండల తాహశీల్దార్ నాగరాజు,ఏఈవోలు ఫయాజ్,నాగరాజు,సొసైటీ సీఈఓ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం మండల ప్రజలకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు.

**-అజ్మీరా కల్పనసునీల్ నాయక్.**



**బయ్యారం/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):** వైకుంఠ ఏకాదశి పవిత్ర దినాన్ని మంగళవారం ప్రజలు భక్తి ప్రపత్తులతో జరుపుకుంటారని ఈ సందర్భంగా మండల ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ మండల నాయకురాలు అజ్మీరా కల్పన సునీల్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీమహావిష్ణువు సహిత దేవతలకు అత్యంత ప్రీతిపాత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మండల ప్రజలకు శుభం జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ పర్వదినాన భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే సకల పుణ్యాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయన్నారు. ఈ పవిత్రమైన పండుగ సందర్భంగా ప్రజలందరికి మంచి జరగాలని ప్రార్థిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ధర్మసాగర్ నక్కల తూం కాల్వ పనులు ఎప్పుడు?

**నిండుకుండలా ఉన్న రిజర్వాయర్ సాగునీరు లేక గోసపడుతున్న రైతులు**

**ధర్మసాగర్ ,దేవునూరు-మడిపల్లి-ఉనికిచెర్ల రైతుల ఆవేదన -ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించాలని రైతుల డిమాండ్**



నక్కల తూం నిర్మాణం



దేవాదుల ద్వారా. రిజర్వాయర్ లోకి నీరు

**హనుమకొండ బ్యూరో ధర్మసాగర్/డిసెంబర్ (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో ఉన్న రిజర్వాయర్ నిండుకుండలా నీటితో కళకళలాడుతున్నా, అదే నీరు పరిసర గ్రామాల రైతు పొలాలకు అందకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ధర్మసాగర్, దేవునూరు, మడిపల్లి, ఉనికిచెర్ల గ్రామాలకు చెందిన రైతులు సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నక్కల తూము, కాల్వల ద్వారా సాగునీరు అందించే అవకాశం పూర్తిగా ఉన్నప్పటికీ, ఈ పనులు ఏళ్ల తరబడి ప్రారంభం కాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. రిజర్వాయర్ నుంచి దూర ప్రాంతాలకు మాత్రం నీరు సరఫరా అవుతుండగా, అదే రిజర్వాయర్‌పై ఆధారపడి జీవించే ధర్మసాగర్ మండల రైతులకు నీరు అందకపోవడం అన్యాయమని వారు వాపోతున్నారు.

### ఎన్నికల వేళ హామీలు -ఆ తర్వాత నిర్లక్ష్యం

ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు సమీపిస్తే నక్కల తూము, కాల్వల పనులు చేస్తామని రాజకీయ నేతలు హామీలు ఇస్తున్నారని రైతులు గుర్తుచేశారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే ఆ హామీలు మరిచిపోవడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రతి సాగు సీజన్‌లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

సాగునీరు లేక వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటోందని రైతులు తెలిపారు. పెట్టుబడులు పెట్టి పంటలు వేసుకున్నా, తగిన నీరు లేక దిగుబడులు తగ్గుతున్నాయని, దీంతో అప్పులు పెరిగి రైతు కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### రైతుల డిమాండ్ ఇదే

ఈ పరిస్థితిపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంటనే స్పందించి ధర్మసాగర్ నక్కల తూము, కాల్వల పనులను




తక్షణమే ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి కాలువలను మరమ్మతులు చేసి, సాగునీరు నేరుగా పంట పొలాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిండుకుండలా ఉన్న రిజర్వాయర్ రైతులకు ఉపయోగపడకపోతే, ఆ నీటికి విలువే ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ హామీలకే పరిమితం కాకుండా, రైతుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని ధర్మసాగర్ ప్రాంతానికి సాగునీరు అందించాలని వారు కోరుతున్నారు.

# ప్రజాపాలనకు బాటలు

**కమ్మరిపేటలో ఫిర్యాదుల స్వీకరణకు విస్తృత ఏర్పాట్లు**

**ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం - సర్పంచ్ జోడుముంతల కిరణ్**

**హనుమకొండ బ్యూరో/వేలేరు డిసెంబర్30 ( జర్నలిస్ట్ వార్త)** హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని కమ్మరిపేట గ్రామ పంచాయతీ భవనంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే దిశగా ఫిర్యాదుల స్వీకరణకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. గ్రామ పాలనను ప్రజలకు మరింత దగ్గర చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ జోడుముంతల కిరణ్ వెల్లడించారు. గ్రామంలో త్రాగునీరు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం, రహదారులు, పింఛన్లు, నివాస సమస్యలు వంటి అనేక అంశాలపై గ్రామస్తులు తమ ఫిర్యాదులను నేరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించామని ఆయన తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పద్ధతిగా నమోదు చేసి, ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సత్వర పరిష్కారానికి



చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్న సర్పంచ్, ఫిర్యాదుల స్వీకరణ ప్రక్రియ ద్వారా పారదర్శక పాలనకు బలమైన పునాది పడుతుందని అన్నారు. గ్రామస్తులు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ సమస్యలను తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ సౌజన్య, ఉపసర్పంచ్ సూర్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అంశాన్ని గంభీరంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో సమస్యలు పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేలా, బాధ్యతాయుత పాలనకు ఇది నిదర్శనమని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. కమ్మరిపేట గ్రామంలో ఈ ఫిర్యాదుల స్వీకరణ విధానం భవిష్యత్తులో మరింత ప్రభావవంతమైన పాలనకు మార్గం వేస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నూతన సర్పంచ్ తిరుపతమ్మ ను సన్మానించిన న్యాయవాది రమేష్ గౌడ్



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త) :** చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన ఇల్లందుల తిరుపతమ్మ ను తన తోటి చదివిన హై కోర్టు న్యాయవాది, జేమిని ఎపేక్సె కంపెనీ లీగల్ అడ్వాజర్ తాళ్ళపేల్లి రమేష్ గౌడ్ తో పాటు క్లాస్మేట్ మర్యాదపూర్వకంగా కలిసి మంగళవారం రోజున సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మను,ఆమె సోదరుడు ఇల్లందుల సుదర్శన్ ను శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ఇల్లందుల సుదర్శన్, క్లాస్మేట్ బృందం తాళ్ళపే ల్లి సంపత్, వార్డు సభ్యులు శాగ శ్రీనివాస్, చుక్క యాదలక్ష్మీ,గంగుల రవీందర్ రెడ్డి, 1990-1991 బ్యాచ్ కు చెందిన తోటి మిత్రులు తదితరులు పాల్గొన్నారు

# అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**జనవరి 2న మడికొండలో వరంగల్ ఉమ్మడి జిల్లా అర్చక ఉద్యోగ సదస్సు**

**తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ**




**భీమదేవరపల్లి/డిసెంబర్30 (జర్నలిస్ట్ వార్త):** దూప దీప నైవేద్య అర్చకుల కోసం చట్ట సవరణ చేసి దూప దీప నైవేద్య అర్చకులను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో అర్చక ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. దేవాలయ ఉప ప్రధాన అర్చకుడు కంచనపల్లి రాజయ్య శర్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ దూప దీప నైవేద్య అర్చకుల కోసం చట్ట సవరణ చేసి దూప దీప నైవేద్య అర్చకులను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. దేవాదాయ శాఖకు రక్షణ కవచంగా మారిన 30/87, 2007చట్టం, 888జోవోను సవరించాలన్నారు. 6ఎ, 6బి, 6సి కేటగిరి దేవాలయాలలో పని చేస్తున్న అర్చక ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ 4వ తరగతి ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలన్నారు. ఈ 3 కేటగిరి దేవాలయాలలో పని చేస్తున్న అర్చక సిబ్బంది ఉద్యోగులు సుమారు 8 వేల మంది ఉన్నారని వారికోసం ఈ పోరాటం చేస్తామన్నారు. ఆర్భాటాలు లేకుండా సంఖ్య బలానికి అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగడానికి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని, 121 జీవో రద్దు పరచడం వలన దేవాలయాలలో 5 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న తాత్కాలిక అర్చక ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలని కోరారు. ఈ చట్ట సవరణ కొరకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ మంత్రి కొండ సురేఖ, బీసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గారు చొరవ చూపాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కాలయాపన చేయకుండా దేవాదాయ శాఖ పదవి విరమణ పొందిన ఉద్యోగులతో బహుముఖ ప్రజ్ఞా శాలులతో కమిటీ నియమించాలన్నారు. దీని వలన రాష్ట్రం లో ఉన్న 16 వేల దేవాలయాల లో పని చేస్తున్న అర్చక ఉద్యోగులకు దూప దీప నైవేద్య అర్చకులకు న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. జనవరి 2వ తేదీన మడికొండ లో నిర్వహిస్తున్న వరంగల్ ఉమ్మడి జిల్లా అర్చక ఉద్యోగ సదస్సు విజయవంతం చేయాలని కోరారు. అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డివిఆర్ శర్మ మాట్లాడుతూ తెలంగాణ దేవాదాయ శాఖ నూతన చట్ట సవరణ చేసి అధికారులకు ఒక విధంగా అర్చక ఉద్యోగులకు ఒక విధంగా వేతన విధానాలు ఉన్నాయని ఈ అసమానతలు తొలగించి తెలంగాణ దేవాదాయ శాఖలో ఒకే శాఖ ఒకే వేతన విధానం అమలు పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ముఖ్యర్చకులు మొగిలిపాలెం రాంబాబు, గుడ్ల శ్రీకాంత శర్మ, అర్చకులు తాటికొండ వినయ్ శర్మ, నందనం సందీప్ శర్మ, తాటికొండ రమేష్ శర్మ,జానకీపురం రవి శర్మ, శరత్ చంద్ర, శివకుమార్, శ్రావణ్ కుమార్, సిబ్బంది రవి, శ్రీధర్, బిక్షపతి, రాజేందర్, రాజు, కళ్యాణి, చాంద్ బీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):** బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్,బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అండగా నిలిచారు. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన కొండేటి శ్రీకాంత్ పక్షవాతం తో బాధపడుతుండగా మంగళవారం హైదారాబాద్ లోని వారి నివాసంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి వైద్య ఖర్చులు నిమిత్తం 10000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి గజవెల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసిన మెకానిక్ చారి



**తల్లాడ/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలో రైతులకు, ట్రాక్టర్ యాజమాన్యులకు, శ్రేయోభిలాషులు అందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాటికొండ తిరుమల చారి (మెకానిక్ చారి) మాట్లాడుతూ ప్రజలఅందరికీ వైకుంఠ ఏకాదశి శు భాకాంక్షలు తెలియజేశారు. శ్రీవారి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## ముక్కోటి వేళ..
## భక్తులతో కిక్కిరిసిన కోదండరామలయం.




**బయ్యారం/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):**బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమాయ్యాయి.మంగళవారం అర్థరాత్రి 2.35 గంటలకు మూల విరాట్టుకు ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనా చార్యులు ఏకాంతంగా కైంకర్యాలను నిర్వహించారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా బయ్యారం రామాలయంలో భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.అర్థరాత్రి నుంచే రామాలయంలో వైకుంఠ ద్వారం తెరుచుకోవడంతో దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది.ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం వైకుంఠ ద్వారాలను అర్చకులు సుదర్శన చార్యులు తెరిచారు.ఉదయం 5:30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనంలో స్వామివారిని భక్తులు దర్శించుకొంన్నారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని పువ్వులతో సుందరంగా అలంకరించారు.వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారి దర్శనం చేసుకోవడం అత్యంత పుణ్యఫలం అని, సమస్త పాపాలు నశించి,మోక్షం లభిస్తుందని అర్చకులు సుదర్శన చార్యులు తెలిపారు.భక్తులకు ఎటువంటి సమస్య కలగకుండా భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఆలయ కమిటీ చైర్మన్ గాదె కృష్ణ రెడ్డి,సెక్రటరీ కొల్లా వెంకటేశ్వరరావు,పెద్దినేని వెంకటేశ్వరరావు,బేబీ, వైఎస్. రెడ్డి,మాధవరావు,నంబూరి రామకృష్ణ,తిరుపతి రావు, సిహెచ్.వెంకటనారాయణ, చెరుకుపల్లి నర్సయ్య,మల్లేష్,సుమన్,నిర్మలరెడ్డి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడలతో క్రమశిక్షణ-యువతతోనే దేశ ప్రగతి

### బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు బహుమతులు
### -యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎంపీడీవో అనిల్ కుమార్







**హనుమకొండ బ్యూరో ధర్మసాగర్/డిసెంబర్ (జర్నలిస్ట్ వార్త):** యువత క్రీడల ద్వారా క్రమశిక్షణను అలవర్చుకొని లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని, యువతతోనే దేశ ప్రగతి సాధ్యమని ధర్మసాగర్ ఎంపీడీవో అనిల్ కుమార్ అన్నారు. ఎస్సై దిలీప్‌తో కలిసి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ధర్మసాగర్, వేలేర్ బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. మేరా యువభారత్ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీడీవో అనిల్ కుమార్, ఎస్సై దిలీప్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని సూచించారు. జీవితంలో ఒక గమ్యం, ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని, క్రీడల్లో గెలుపుఓటములు సహజమని, కానీ క్రీడా స్ఫూర్తిని జీవితంలో అమలు చేయాలని అన్నారు.జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో క్రీడల్లో రాణించి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా సమాజంలో గౌరవంగా జీవించాలని యువతను కోరారు.ఈ కార్యక్రమంలో మేరా యువభారత్ వాలంటీర్ మండ రాజేష్, ఇసంపల్లి రమేష్, పిడి శ్రీనాథ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు ప్రభాకర్, భాస్కర్, గణేష్, వేణు, గోపాలకృష్ణ, బాబురావు, మంజుల, రవళి, యూత్ సభ్యులు, వివిధ ప్రాంతాల యువతీయువకులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలు సురక్షితంగా జరుపుకోవాలి

**సంబరాల పేరుతో రోడ్లపైకి రావద్దు**

**మద్యం, మత్తుపదార్థాలపై కఠిన చర్యలు తప్పవు**

**- ధర్మసాగర్ సీఐ కె. శ్రీధర్ రావు**



**హనుమకొండ బ్యూరో ధర్మసాగర్/డిసెంబర్ 31 (జర్నలిస్ట్ వార్త):** నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా జరుపుకోవాలని ధర్మసాగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీధర్ రావు ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. వేడుకల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా, రోడ్లపైకి వచ్చి కేక్ కట్ చేయడం, అరుపులు, గందరగోళం సృష్టించడం చేయరాదని హెచ్చరించారు.

యువత మద్యం సేవించి బైకులపై విన్యాసాలు చేయడం, అతివేగంగా వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు పోలీసుల దృష్టికి వస్తే తప్పకుండా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడితే జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు.

నూతన సంవత్సరం సందర్భంగా హొటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు తదితర ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. డ్రగ్స్ లేదా ఇతర నిషేధిత మత్తుపదార్థాలు వినియోగించినా, సరఫరా చేసినా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైలెన్సర్ శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, అసభ్య ప్రవర్తన, ముఖ్యంగా మహిళల పట్ల దురుసుగా వ్యవహరించడం సహించబోమని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా జరుపుకుని పోలీసులకు సహకరించాలని ధర్మసాగర్ సీఐ కె. శ్రీధర్ రావు ప్రజలను కోరారు.

# ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ గ్రామంలో గల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు జీడి కంటి వరుణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ మారపాక సుజనాశ్రీనివాస్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ముక్కోటి వైకుంఠ ఏకాద శికి భక్తులు తండోపతండాలుగా అధికసంఖ్యలోతరలి వచ్చారు కాగా, స్వామివారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.స్వామివారిని భక్తులు గోవింద నామ స్వరములు చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున రావడంతో దేవాలయం కోలాహ లంగా కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ ని తీర్థప్రసాదాల స్వీకరించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నా రు. ముక్కోటి ఏకాదశి కావడంతో భక్తులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పండుగ బద్రి, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# చిల్పూర్ దేవస్థానంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి

### .హాజరైన హాజరైన పొట్లపల్లి శ్రీధర్ రావు -.ముక్కోటికి వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త) :** చిల్పూర్ మండలకేంద్రంలో చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రోజు న ముక్కోటి ఏకాదశి సందర్భంగా కార్యనిర్వాహణాధి కారి బి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు- కిరణ్మయి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ముక్కోటి వైకుంఠ ఏకాదశికి భక్తులు తండోపతండాలుగా వేల సంఖ్యలో తరలివచ్చారు కాగా, స్వామివారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.స్వామివారిని భక్తులు గోవింద నామస్వరములు చేస్తూ స్వామివారిని దర్శిం చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున రావడంతో దేవాల యం కోలాహలంగా కిటకిటలాడింది వివిధ గ్రామాల నుండి పట్టణాలనుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ ని తీర్థప్రసాదాల స్వీకరించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నా రు. ముక్కోటి ఏకాదశి కావడంతో భక్తులు వెంకన్న ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పొట్టపల్లి శ్రీధర్ రావు, ఈవో బి లక్ష్మీ ప్రసన్న ,జూనియర్ అసిస్టెంట్ కె మోహన్, ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, రికార్డు



అసిస్టెంట్ వీరన్న,ఆలయ సిబ్బంది విశాల్, రాజశేఖర్, మహేష్, కృష్ణ ఆలయ ధర్మకర్తల మండలిసభ్యులు తదితరులు పాల్గొన్నారు

# కల్లూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన కల్లూరు ఏసీపీ..





**కల్లూరు/డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):**కల్లూరు పోలీస్ స్టేషన్ ను కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సందర్శించారు. మంగళవారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఏసీపీ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు,. సి సిటీఎన్ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. పోలీసులు దృష్టి పెట్టాలని రౌడీషీటర్లు, హిస్టరీ పై దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయిలో అవగాహన ఉండాలని సెక్టర్ పోలీస్ ఆఫీసర్లకు సూచించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. పాత నేరస్థుల కదలికలను నిఘా పెట్టాలన్నారు.

# ఘన్పూర్ మున్సిపాలిటీలో ఓటు అడిగే హక్కు కడియం లేదు

### -మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఓటు అడిగే హక్కు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి లేదని తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పెన్షన్లు, స్కూటీ, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, రైతు బీమా తొలగించారని విమర్శించారు. న్యూట్రిషన్, కేసీఆర్ కిట్టు, క్రిస్మస్, బతుకమ్మ పండుగ సందర్భంగా రేషన్ కార్డుల కలిగిన చీర ఏమైందని ప్రశ్నించారు. రెసిడెన్షి య ల్ 106 పాఠశాలల్లో చనిపోయిన విద్యార్థులను పట్టించుకునే దిక్కులేదని వాపోయారు.రైతులు 713 మంది చనిపోతే రైతు బీమా అందించిన దాఖలాలు లేవని అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నియోజ క వర్గంలో కడియం రాక్షసపాలన చేస్తున్నారని ఆరో పించారు. ఘనపూర్ మున్సిపాలిటీ లో ఓటు అడిగే హక్కు కడియం శ్రీహరికి లేదని అన్నారు. నిస్సిగ్గుగా బీఆర్ఎస్ లోనే ఉన్నానని, కాంగ్రెస్ లో మాత్రం చేరలే దని కలిసి మాత్రమే పని చేస్తున్నానని చెప్పడం కడియంది సిగ్గుమాలిన చర్య అన్నారు. తాను రాష్ట్ర సాధనలో ఎమ్మెల్యే పదివికి రాజీనామా చేసి, మలి ఉద్యమంలో తొలి దళితబిడ్డగా పోరాడింది తానేనని అన్నారు. దళిత బంధులో ఎలాంటి అవినీతి జరగలే దని అన్నారు.43సంవత్సరాల వైద్యుడిగా అనుభవం, దేశ వ్యాపితంగా ఉత్తమ వైద్యుడిగా పేరు తెచ్చుకుని, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ తెచ్చిన ఘనత తనదేనని అన్నారు. తమ పార్టీ శ్రేణులపై పోలీసులు వహిస్తున్న దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, పింకు బుక్కు లో తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకున్నామని అన్నారు. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చేది బీఆర్ ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ గౌడ్, మహేందర్ రెడ్డి,మున్సిపాలిటీ ఇంచార్జ్ కనకం గణేష్, పెసరు సారయ్య, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేష్, కుంభం కుమార్ స్వామి, ఆకారపు అశోక్, తదితరు లు పాల్గొన్నారు.

# ఏ ఐ ఎఫ్ డి ఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

### -ఎక్సైజ్ ఎస్సై శర్వాణి




**నర్సంపేట/డిసెంబర్30 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణంలోని భద్రకాళి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఏ ఐ ఎఫ్ డి ఎస్. ఆధ్వర్యంలో డ్రగ్స్ మత్తు మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు . ఏ ఐ ఎఫ్ డి ఎస్. జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఎస్సై శార్వాణి హాజరయ్యారు అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ మత్తు పానీయాలకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా తమ జీవితాలను అంధకారం చేసుకోవద్దని విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో యు పి ఎన్ ఎం.రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, జిల్లా కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ . ఏ ఐ ఎఫ్ డి ఎస్ . జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, జిల్లా సహాయ కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్ట్ వార్త TELTEL/2023/87607
బుధవారం 31 డిసెంబర్ 2025

## నూతన సంవత్సర వేడుకలు సురక్షితంగా జరుపుకోవాలి

### డ్రంక్ అండ్ డ్రైవ్‌కు కఠిన చర్యలు - ఎస్ఐ వెంకటకృష్ణ హెచ్చరిక



**తల్లాడ/డిసెంబర్30 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా, శాంతియుతంగా జరుపుకోవాలని తల్లాడ ఎస్ఐ వెంకటకృష్ణ సూచించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా యువకులు బైక్‌లపై ప్రమాదకర విన్యాసాలు చేయడం, అధిక శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తగదని ఆయన హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వాహనాలను స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేడుకల నేపథ్యంలో మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో నలుమూలల డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, అలా పట్టుబడితే జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. ఆనంద క్షణాలను పోలీస్ స్టేషన్‌లో గడపకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదేవిధంగా మహిళలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, తమ ఆనందం కోసం ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని ఆయన అన్నారు. షాపింగ్ లేదా ఇతర కార్యక్రమాలకు వెళ్లే సమయంలో పోలీసుల సూచనలు పాటిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్ఐ వెంకటకృష్ణ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## కరెంట్ బిల్లు చెల్లించమని అడిగినందుకు విద్యుత్ ఉద్యోగి పై దాడి



**రాయపర్తి/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మొరిపిరాల గ్రామంలో కరెంట్ బిల్లు చెల్లించమని అడిగినందుకు విద్యుత్ ఉద్యోగి అసిస్టెంట్ లైన్ మెన్ ఊరటి శ్రీకాంత్ పై మంగళవారం కిష్టాపురం గ్రామానికి చెందిన కునుసోత్ శ్రీను, శంకర్ లు దాడి చేశారు. ఈ ఘటనలో ఏఎల్ఏం శ్రీకాంత్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్లో దాడికి పాల్పడిన వారిపై ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ సిబ్బంది తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ ఉద్యోగులపై దాడి చేయడం సరైంది కాదని దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు

## మదర్ థెరిస్సా సేవాసదనము మూడవ వార్షికోత్సవ వేడుక.




**మధిర/డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త)** మధిర నియోజకవర్గంమదర్ థెరిస్సా సేవాసదనము మూడవ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పదవ వార్డు మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు గా, మధిర పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మిరియాలవెంకట రమణ గుప్తా , సామాజిక సేవకులు విశ్రాంత ఎంపీడీవో మాధవరపు నాగేశ్వర రావు , మధిర సేవాసమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాద్ , దైవ సేవకులు ఆనందరావు ,రాము మాస్టర్ , సేవాసదనానికి నిత్యం సన్నిహితంగా వుండి సహకారం అందిస్తున్న "బిలీవర్స్" పాల్గొన్నారు. అతిథులుగా విచ్చేసిన పెద్దలందరూ, మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగ పిల్లలకు కావలసినటువంటి వివిధ సహాయ, సహకారాలు ఇకముందు కూడా అందించగలమని భరోసా ఇచ్చారు. విచ్చేసిన అతిథులు, పెద్దలు, నాయకులు, బిలీవర్స్ అందరకూ, మదర్ థెరిస్సా సేవాసదనము మూడవ వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేసి మానసిక దివ్యాంగ పిల్లలను ఆశీర్వదించినందుకు, పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు, కృతజ్ఞతలు తెలిపారు.

## సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రమేశ్ బాధ్యతలు స్వీకరణ



హైదరాబాద్,డిసెంబరు 30: సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గా 2005 బ్యాచ్ కు చెందిన డాక్టర్ ఎం. రమేశ్, మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్, పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్ ఐజీ గా పని చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడడం, పారదర్శకత, ప్రజా పోలిసింగ్, ప్రజలందరికీ నిష్పక్షపాతంగా సేవలు అందించదానికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తామన్నారు. రానున్న నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 'జీరో ఇన్సిడెంట్ డే' గా జరుపుకోవాలన్నారు.

## దుర్గం చెరువులో ఆక్రమణలు

### మట్టితో పూడ్చి పార్కింగ్ దందా

### రంగంలోకి దిగి ఆక్రమణల తొలగించిన హైడ్రా

హైదరాబాద్,డిసెంబరు 30:నగరంలోని దుర్గం చెరువు ఆక్రమణలకు హైడ్రా అధికారులు చెక్ పెట్టారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దుర్గం చెరువులో దాదాపు 5 ఎకరాల మేర ఉన్న ఆక్రమణలను హైడ్రా సిబ్బంది మంగళవారం తొలగించారు. చెరువులో మట్టితో నింపి వాహనాల పెయిడ్ పార్కింగ్ కోసం వినియోగించి ప్రతి నెలా రూ.50 లక్షల వరకూ అద్దెలు వసూలు చేస్తున్న దందాకు తెరదించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని ఆక్రమణలను తొలగించారు. అక్కడి వాహనాలను ఖాళీ చేయించి ప్రస్తుతానికి ఫెన్సింగ్ వేశారు. తర్వాత మట్టిని తొలగిస్తామని అధికారులు తెలిపారు. కబ్జాల పర్వంపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. ఐటీ కారిడార్‌లో ఒకప్పుడు 160 ఎకరాల మేర ఉన్న ఈ చెరువు ప్రస్తుతం 116 ఎకరాలుగా మిగిలిపోయింది. చెరువుకు ఉత్తర దిశ మినహా.. మూడువైపులా ఆక్రమణలకు గురైంది. కబ్జాల పర్వం ఎలా సాగిందో ఎన్ఆర్ఎస్సీ అందించిన శాటిలైట్ చిత్రాలు కళ్లకు కడుతున్నాయి.

# సర్పంచ్ - ఉపసర్పంచ్ లకు ప్రభుత్వ హెచ్చరిక...

### జాయింట్ చెక్ పవర్ దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు.




**తెలంగాణ/డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):** గ్రామ పంచాయతీల్లో నిధుల నిర్వహణలో సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఉన్న జాయింట్ చెక్ పవర్ (ఉమ్మడి సంతకం అధికారం)ను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. అభివృద్ధి పనుల నిధులను అడ్డుకోవడం, వ్యక్తిగత లేదా రాజకీయ కారణాలతో చెక్ పవర్‌ను దుర్వినియోగం చేయడం తీవ్ర నేరంగా పరిగణిస్తామని పేర్కొంది.

### జాయింట్ చెక్ పవర్ ప్రాముఖ్యత

గ్రామ పంచాయతీ నిధుల నిర్వహణలో పారదర్శకత, భద్రత కోసం సర్పంచ్ %-% ఉప సర్పంచ్ ఉమ్మడి సంతకం తప్పనిసరి అని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామాభివృద్ధి కోసం వెచ్చించే ప్రతి రూపాయికి ఇద్దరి ఆమోదం అవసరమని, ఇది ప్రజాధన రక్షణకు కీలకమైన వ్యవస్థ అని అధికారులు తెలిపారు. అయితే కొన్నిచోట్ల వ్యక్తిగత విభేదాలు, రాజకీయ ఆధిపత్య పోరాటాల వల్ల ఈ చెక్ పవర్ గ్రామాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

### పారదర్శకత పాటిస్తేనే చట్టపరమైన రక్షణ

గ్రామ పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన ప్రతి నిర్ణయం తప్పనిసరిగా గ్రామసభ తీర్మానం ఆధారంగానే జరగాలని ఆదేశించారు. నగదు లావాదేవీలకు బదులుగా ఆన్లైన్ చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఖర్చుల వివరాలను సమయానుకూలంగా రికార్డుల్లో నమోదు చేయాలని, అలా చేస్తే ఆడిట్ తనిఖీల్లో ఎలాంటి సమస్యలు ఉండవని అధికారులు స్పష్టం చేశారు. పారదర్శకత పాటించినప్పుడే ప్రజా ప్రతినిధులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని హెచ్చరించారు.

### అధికార దుర్వినియోగానికి కఠిన శిక్షలు

ప్రజాధనాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడటం, పనులు పూర్తికాకుండానే బిల్లులు డ్రా చేయడం, తప్పుడు లెక్కలు చూపడం, సంతకాలు ఫోర్జరీ చేయడం వంటి చర్యలను తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, పదవి నుంచి తొలగించడమే కాకుండా జైలు శిక్ష విధించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉందని స్పష్టం చేసింది.

### ఆధిపత్య పోరుతో అభివృద్ధికి బ్రేక్?

కొన్ని గ్రామాల్లో సర్పంచ్- ఉప సర్పంచ్‌ల మధ్య ఆధిపత్య పోరు అభివృద్ధి పనులను నిలిపివేస్తోందని అధికారులు గుర్తించారు. రాజకీయ కారణాలతో కావాలనే బిల్లులపై సంతకాలు చేయకుండా పనులను అడ్డుకుంటే ప్రభుత్వం కఠినంగా స్పందిస్తుందని హెచ్చరించింది. విచారణలో గ్రామాభివృద్ధిని అడ్డుకున్నట్లు తేలితే, ఉప సర్పంచ్‌కు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేసే అధికారం కూడా జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# కల్లు గీత కార్మికుల హక్కుల సాధనకు కృషి చేయాలి

### నూతన కమిటీ -వర్ధన్నపేట మండల అధ్యక్షుడిగా జనుగాం యాకయ్య గౌడ్









**వర్ధన్నపేట/ డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):** కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారం, గౌడ కుల అభివృద్ధి లక్ష్యంగా వర్ధన్నపేట మండల కల్లు గీత కార్మిక సంఘం నూతన మండల కమిటీ ఎన్నికలు మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లా నాయకుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా సుదగాని లక్ష్మణ్ గౌడ్‌ను, మండల అధ్యక్షుడిగా జనుగాం యాకయ్య గౌడ్‌ను, ప్రధాన కార్యదర్శిగా సట్ల సూరయ్య గౌడ్‌ను నియమించారు. ఉపాధ్యక్షులు, సోషల్ మీడియా కన్వీనర్లుగా కత్తి వేణు కుమార్ గౌడ్, మెరుగు రాజాలు గౌడ్, కొయ్యేటి కుమారస్వామి గౌడ్‌లకు బాధ్యతలు అప్పగించారు. సహాయ కార్యదర్శులుగా బూర అశోక్ గౌడ్, బొల్లెపల్లి కుమారస్వామి గౌడ్, మడత ప్రశాంత్ గౌడ్‌లను, కార్యవర్గ సభ్యులుగా కత్తి రాజు గౌడ్, బూర సంపత్ గౌడ్, సట్ల నరసింహులు గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వీరస్వామి గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి బాలగాని రాంబాబు గౌడ్, పర్వతగిరి మండల అధ్యక్షుడు బండి సతీష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కల్లు గీత కార్మికుల సంక్షేమానికి సంఘం చేపడుతున్న ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ తెలంగాణ కల్లు గీత కార్మికుల సంఘం లక్ష్యాల సాధనకు నిరంతరం పోరాడుతామని, కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాల అమలులో ఏ లోటుపాట్లు లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య గౌడ్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల గౌడ సంఘం నాయకులు, కల్లు గీత కార్మికులు, గౌడ కుల పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# వైకుంఠ ఏకాదశికి భక్తుల దాహార్తి తీర్చిన ఈగ మల్లేశం

### శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి బోరు మోటార్ విరాళం

### దైవసేవలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉంది - ఈగ మల్లేశం





**వర్ధన్నపేట/డిసెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ముక్కోటి ఏకాదశి సందర్భంగా దేవాలయానికి తరలివచ్చే వేలాది భక్తుల తాగునీటి అవసరాలను శాశ్వతంగా తీర్చే ఉద్దేశంతో, ఈగ మల్లేశం తమ స్వంత ఖర్చులతో బోరు మోటార్ కొనుగోలు చేసి ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈ సేవా కార్యక్రమం భక్తుల్లోనూ, స్థానికులలోనూ విశేష



స్పందనను పొందింది.

ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ, "శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సేవలో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా, ఆత్మసంతృప్తిని కలిగిస్తోంది" అని తెలిపారు.

అనంతరం వర్ధన్నపేట పట్టణ ప్రజలు ఈగ మల్లేశం సేవాభావాన్ని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. ఆలయ అర్చకులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో తుమ్మల యాకయ్య, కొండేటి సత్యం, సమ్మెట శ్రీనివాస్, తుమ్మల రవీందర్, సమ్మెట రాంబాబు, మార్త సారంగపాణి, కరిమిల్ల సంపత్ రావు, పెద్దూరి రాజ్ కుమార్, యుగంధర్, సమ్మెట సుధీర్, చెన్న శ్రీధర్, గుజ్జ సోమేశ్వర రావు, కేదారి, మల్లెపాక అనిల్, ఆరెల్లి నాగార్జున, దొమ్మటి భాను చందర్, వడ్లకొండ రవీందర్‌తో పాటు అర్చకులు కలకోట గోపాల చారి, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**-ఘనంగా పౌర హక్కుల దినోత్సవం - నెక్కొండ మండల డిప్యూటీ తహసీల్దార్ పల్లకొండ రవి**





**నెక్కొండ/డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త)**
వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకట్ నాయక్ తండ గ్రామపంచాయతీ పరిధిలో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెక్కొండ మండల డిప్యూటీ తహసీల్దార్ పల్లకొండ రవి హాజరై మాట్లాడారు.
ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రశ్నిస్తూ పొందాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, ఆలోచన విధానాన్ని కొనసాగిస్తూ రాజ్యాంగంలో పొందుపరిచిన పౌర హక్కులు, విధులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు.
ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యం ద్వారా సమాజాభివృద్ధికి ప్రజలు తోడ్పడాలని, గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంటరానితనం, కుల వివక్షత నిర్మూలనకు నిరంతరం కృషి చేయాలని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా నిలవాలన్నారు.
అనంతరం పౌర హక్కుల ప్రతిజ్ఞ చేయించారు. కుల వివక్షత వ్యతిరేకంగా, అంటరానితనం నిర్మూలనలో భాగంగా సమానత్వాన్ని చాటే విధంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మాలు నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బి. శైలజ, ఐకెపి ఎపిఎం రాపాక కిరణ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ జి. భాగ్యమ్మ, అంబేద్కర్ యువజన సంఘం మరియు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాంకాల యాదగిరి, జిపిఓ బి. శ్రీనివాస్, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ కే. రాజేష్, ఆశ వర్కర్ ధరావత్ జ్యోతి, అంగన్వాడి టీచర్ రామ, సీసీ రవీందర్, వివో ఏ. మేడి స్వర్ణలత, గ్రామపంచాయతీ సిబ్బంది గుగులోత్ రాకేష్, దరావత్ దేవా తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# తల్లాడలో ఘనంగా జరిగిన క్రిస్టియన్ సోదరుల ప్రేమ విందు

**సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన పలు సంఘాల క్రిస్టియన్ పెద్దలు.**





**తల్లాడ/డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):**
ప్రజా ప్రతినిధులకు,తల్లాడ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం సర్వమతాలను సమదృష్టితో చూడాలన్న సంకల్పంతో క్రిస్టమస్ సందర్భంగా క్రిస్టియన్ సోదరీ సోదరీమణులకు స్థానిక సంఘ పెద్దలతో ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నూతనంగా నిర్మించబడుతున్న అంబేద్కర్ భవన్ లో మంగళవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు,వివిధ గ్రామాల క్రిస్టియన్ సోదరీ,సోదరీమణులు పాల్గొన్నారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏసుక్రీస్తు చూపిన ప్రేమను అనుసరించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ ఇన్స్పెక్టర్ , క్రిస్టియన్ ప్రముఖులతో కలిసి కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేసి అనంతరం ప్రభుత్వం చేత అందించబడుతున్న క్రిస్టమస్ ప్రేమ విందును ప్రతి ఒక్కరు స్వీకరించారు. అనంతరం పలువురుకు శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు.
ఈ కార్యక్రమంలో వివిధ ఆర్గనైజేషన్ (ఎన్. సీ. సీ,టి సి, ఏఐసీసీ) క్రిస్టియన్ నాయకులు మేకల ప్రసాదరావు, సంఘసాని శ్రీనివాస్,కె. కెనడి రాజు,ఐ. శ్రీనివాసరావు,కె.వి ఇశ్రాయేలు,టి.సాల్మన్ రాజ్,జి.బాబురావు, ఎం.ఇజ్రాయిల్. మండల కాంగ్రెస్ నాయకులు దగ్గుల రఘుపతి రెడ్డి,తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు జి.వి.ఆర్,మాజీ జెడ్పిటిసి మూకర ప్రసాద్, గొడుగునూరి లచ్చిరెడ్డి,ఆర్.ఐ,టిడిపి నాయకులు ధూపాటి భద్రరాజు,సరికొండ శ్రీనివాసరాజు, క్రిస్టియన్ సోదరీ సోదరీమణులు విశ్వాసులు తదితరులు అధికంగా పాల్గొన్నారు

# సమన్వయతో చివరి వరకు పోరాడితే విజయం

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





**ఖమ్మం బ్యూరో/డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):**
క్రీడలు మనిషిలోని నైపుణ్యతను, క్రీడాస్ఫూర్తిని చాటుతుందివిజయ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ లీగ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన జిల్లా కలెక్టర్క్రీడలలో ముందుకు సాగాలంటే టీం వర్క్ చాలా ముఖ్యమని, జట్టులో క్రీడాకారుల సమన్వయంతోనే విజయం సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కొణిజర్ల లోని విజయ ఇంజనీరింగ్ కళాశాల మైదానం నందు నిర్వహిస్తున్న ఈతరం క్లబ్, ఈనాడు ఆధ్వర్యంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ క్రికెట్ లీగ్ 2025' ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల ముంగిపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఫైనల్ పోటీలలో సీనియర్ విభాగంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల, ఖమ్మం ఎస్ఆర్బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ విభాగంలో హార్వెస్ట్ జూనియర్ కళాశాల, కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టులకు విభాగాల వారిగా విజేతలకు, రన్నరఫ్ జట్టులకు ట్రోఫీలను జిల్లా కలెక్టర్ ప్రధానం చేసి, ప్రోత్సాహక బహుమతులను క్రీడాకారులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ యువతకు క్రీడల పట్ల మరింత అసక్తి పెరగాల్సిన అవసరం ఉందని, క్రీడల వల్ల సమయస్ఫూర్తి, ఐకత్య నేర్చుకుంటామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నైపుణ్యం గల క్రీడాకారులు బయటకు రావాలని ఆకాంక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఖమ్మం నగరంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. క్రీడల ద్వారా జీవితంలో ముఖ్యమైన పాఠాలు నేర్చుకోవచ్చని, స్వీయ నియంత్రణ, టీం స్పిరిట్, ఓటమి నుంచి కోలుకొని విజయం వైపు కొనసాగడం వంటి అనేక మంచి గుణాలు నేర్పిస్తుందని అన్నారు. ప్రతి రోజు కొంత సమయం క్రీడలకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు.మానసిక ఉల్లాసం, శారీరక ఎదుగుదలకు దోహదపడే క్రీడలను మన జిల్లాలో ప్రోత్సహించడం సంతోషంగా ఉందని అన్నారు. ఖమ్మం నగరంలో కనీస సౌకర్యాలతో పాటు పిల్లలకు క్రీడలు ఆడుకునేందుకు వసతుల కల్పన చేస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, భవిష్యత్తులో ఖమ్మం నుంచి మంచి క్రీడాకారులు వస్తారని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల తహసీల్దార్ అరుణ, ఉషాకిరణ్, రవిమారుత్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ నీ అకాస్మిక తనిఖీ

**ఎస్సై సిబ్బందిపై ప్రశంసల జల్లు.**
**నర్సంపేట ఏసిపి పి. రవీందర్ రెడ్డి**





**నర్సంపేట/డిసెంబర్30 (జర్నలిస్ట్ వార్త)బీ**
నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం నర్సంపేట ఏసిపి పి.రవీందర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, రికార్డుల నమోదు. శాంతి భద్రతల పరిరక్షణలో సిబ్బంది తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. మూడు సంవత్సరాలకు సంబంధించిన కేసుల గురించి ఆరా తీసి, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీలు, కేడీలు వారు ప్రస్తుతం చేస్తున్న కార్యకలాపాల గురించి తెలుసుకొని, నేరాలు నిరోధించాలని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఎటువంటి అసాంఘిక చర్యలు జరగకుండా చూడాలని శాంతి భద్రతలు కాపాడాలని తెలిపారు. తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎసిపి తెలుసుకున్నారు. ప్రతి అంశాన్ని పక్కాగా రికార్డు చేయడంలో ఎస్.ఐ చూపిస్తున్న చొరవను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.
తనిఖీ అనంతరం ఏసిపి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ చెన్నారావుపేట ఎస్సై మరియు పోలీస్ సిబ్బంది అత్యంత క్రమ శిక్షణతో, సమన్వయంతో పని చేస్తున్నారని కొనియాడారు. మండలంలో నేరాల అదుపునకు సిబ్బంది పడుతున్న శ్రమను కొనియాడారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఇదే ఉత్సాహంతో పని చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. బాధితులకు తక్షణ న్యాయం అందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రాజేష్ రెడ్డి, ఏఎస్ఐ లక్షణామూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన సంవత్సరం వేడుకల్లో అప్రమత్తత అవసరం

**చట్ట ఉల్లంఘనలకు తావిస్తే కఠిన చర్యలు - వర్ధన్నపేట ఎస్సై సాయి బాబు**




**వర్ధన్నపేట/డిసెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):**
నూతన సంవత్సర వేడుకలను ప్రజలు హద్దులు పాటిస్తూ శాంతియుతంగా జరుపుకోవాలని వర్ధన్నపేట ఎస్సై సాయి బాబు పిలుపునిచ్చారు. సంబరాల పేరుతో చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ చేయడం, బైక్ రేసులు, ప్రమాదకర విన్యాసాలు నిర్వహించడం ద్వారా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశముందని హెచ్చరించారు. అతి శబ్దాలు, డీజేలు, పటాసుల వల్ల వృద్ధులు, చిన్నారులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు.నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు పరిరక్షించగలమని అన్నారు.కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, భద్రతా నిబంధనలు పాటిస్తూ నూతన సంవత్సరాన్ని స్వాగతించాలని ఎస్సై సాయి బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నూతన సంవత్సరం వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి

**- తొర్రూరు ఎస్సై ఉపేందర్ హెచ్చరిక**



**తొర్రూరు/డిసెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):**
నూతన సంవత్సరం వేడుకలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని తొర్రూరు ఎస్సై ఉపేందర్ ప్రజలకు సూచించారు. సంబరాల పేరుతో చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.ప్రత్యేకంగా యువత బైక్‌లపై ప్రమాదకర విన్యాసాలు చేయడం, అతి వేగం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. రాత్రి వేళల్లో అనవసర హారన్‌లు, డీజే సౌండ్‌లు, రోడ్లపై గుంపులు గుంపులుగా చేరడం వల్ల ప్రజలకు అసౌకర్యం కలిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పట్టణం మరియు మండల పరిధిలో అదనపు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి నూతన సంవత్సరాన్ని ప్రశాంతంగా, సంతోషంగా స్వాగతించాలని ఎస్సై ఉపేందర్ కోరారు.

# గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్



**వైరా/డిసెంబర్30(జర్నలిస్ట్ వార్త):** మండలం పరిధిలో , సిరిపురం కేజీ, గ్రామంలో లతీఫ్ గర్భిణీ స్త్రీలకు, ఉచిత ఆటో లో, నారపనేనిపల్లి గ్రామంలో , గుడిగె , నవ్య, అనే గర్భిణీ స్త్రీని , అదే గ్రామానికి చెందిన, చేపల మడుగు , స్పందన అనే గర్భిణీ స్త్రీని టెస్టుల నిమిత్తం వైరా గవర్నమెంట్ హాస్పటల్ కు , తీసుకువెళ్లి మరల గర్భిణీ స్త్రీ ఇంటి వద్ద దింపి రావడం జరిగినది, సిరిపురం కేజీ గ్రామానికి చెందిన , నారాపోగు , సావిత్రి , అనే గర్భిణీ స్త్రీని టెస్టుల నిమిత్తం వైరా హాస్పటల్ కి తీసుకువెళ్లి మరలా గర్భిణీ స్త్రీ ఇంటి వద్ద దింపారు .

# సాగు కాల్వ మరమ్మత్తు పనులు ప్రారంభించిన సర్పంచ్ శ్వేతకృష్ణచైతన్య



**నర్సంపేట డిసెంబర్ 30(జర్నలిస్ట్ వార్త ):**
చెన్నారావుపేట మండల కేంద్రంలోని కోపాకుల చెరువు కింద పంట పొలాలకు నీళ్లు వెళ్లే సాగు కాల్వ మరమ్మత్తు పనులను గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణచైతన్య రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రైతుల పంట సాగు కోసం ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దొంతి శ్రీనివాస్,వార్డు సభ్యులు లక్క రాజు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోదావరిలో ముక్కోటి ఏకాదశి

# తెప్పోత్సవం అంగరంగ వైభవం

**ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, టీపీసీసీ నేత నాగ సీతారాములు ప్రత్యేక పాల్గొనడం**



**భద్రాచలం/డిసెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):**
ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో గోదావరి నదిలో నిర్వహించిన తెప్పోత్సవం భక్తుల మధ్య అంగరంగ వైభవంగా, నేత్రపర్వంగా సాగింది. శ్రీరాముని దర్శనార్థం వేలాది భక్తులు తరలిరాగా, భద్రాచలం పరిసర ప్రాంతాలు భక్తిశ్రద్ధలతో మార్మోగాయి.
ఈ తెప్పోత్సవ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు తో కలిసి ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రాష్ట్ర ప్రజలకు ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులందరూ సుఖశాంతులతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ పీవో రాహుల్, ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణదొర, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు తో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.